మౌనంగా ఉన్నారంటే..

సెబీ చీఫ్ మాధవి పురి బచ్ అక్రమాలపై హిండెన్‌బర్గ్ కొత్త సందేహాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బచ్‌పై తాజాగా వచ్చిన అక్రమాల ఆరోపణలపై అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ కొత్త అనుమానాలను లేవదీసింది. ఇంత జరుగుతున్నా మాధవి పురి ఏం మాట్లాడకుండా ఉన్నారంటే ఏదో జరిగే ఉంటుందన్నట్టు వ్యాఖ్యానించింది. ఏమీ లేకపోతే ఎందుకీ మౌనం? అంటూ ప్రశ్నించింది. సెబీ సభ్యురాలిగా ఉన్నప్పుడు ఆయా కంపెనీల నుంచి చెల్లింపులు జరిగాయని, అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు మాధవి పురిపై వస్తున్న విషయం తెలిసిందే. కాగా, అదానీ అక్రమాలపై గత ఏడాది సంచలన రిపోర్టును తీసుకొచ్చిన హిండెన్‌బర్గ్.. ఈ వ్యవహారంలో సెబీ చీఫ్‌గా మాధవి పురి, ఆమె భర్తకూ లింకులున్నాయని గత నెల బయటపెట్టిన సంగతి విదితమే. దీన్ని అదానీ గ్రూప్, పురి దంపతులు కొట్టిపారేశారు.

కార్వీ ఖాతాలు జప్తు

కార్వీ స్టాక్ బ్రోకింగ్, ఆ సంస్థ సీఎండీ సీ పార్థసారథిలకు చెందిన బ్యాంక్-డీమ్యాట్ ఖాతాలు, షేర్లు, మ్యూచువల్ ఫండ్ హోల్డింగ్స్‌ను జప్తు చేయాలని గురువారం సెబీ ఆదేశించింది. దాదాపు రూ.25 కోట్ల బకాయిల వసూలుకుగాను ఈ ఆదేశాలు జారీ చేసింది. క్లయింట్ల నిధులను పవర్ ఆఫ్ అటార్నీ దుర్వినియోగంతో కాజేసిన కేసులో భాగంగానే సెబీ ఈ చర్యలకు దిగింది.

అడ్వాన్స్ ట్యాక్స్‌కు టైమైంది

ఈ నెల 15 దాటితే 15% అదనపు పన్ను భారం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: ట్యాక్స్‌పేయర్లూ అడ్వాన్స్ ట్యాక్స్‌కు సమయం ఆసన్నమైంది. సెప్టెంబర్ 15 సమీపిస్తున్నది మరి. ఈలోగా ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికానికి (జూలై-సెప్టెంబర్)గాను అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించకపోతే 15 శాతం అదనపు పన్ను చెల్లింపుల భారం తప్పదు. రూ.10,000, ఆపై మొత్తాల్లో పన్నులు చెల్లించాల్సి వస్తున్న వ్యక్తులు, సంస్థలు ప్రతీ ఆర్థిక సంవత్సరం 3 నెలలకోసారి అడ్వాన్స్ ట్యాక్స్‌లు చెల్లించాలన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ నెల 15తో రెండో త్రైమాసికం కోసం చెల్లించాల్సిన గడువు తీరిపోతున్నది. దీంతో ఆదాయ పన్ను (ఐటీ) శాఖ వర్గాలు ట్యాక్స్‌పేయర్లను అప్రమత్తం చేస్తున్నాయి. సకాలంలో చెల్లించకపోతే ఆలస్యానికిగాను సదరు మొత్తాలపై వడ్డీలను వసూలు చేస్తారు. ఆర్థిక సంవత్సరంలో ప్రతీ త్రైమాసికం అడ్వాన్స్ ట్యాక్స్‌లను చెల్లించాలి. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్) కోసం జూన్ 15 డెడ్‌లైన్. రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్) కోసం సెప్టెంబర్ 15. మూడు, నాల్గో త్రైమాసికాలకు డిసెంబర్ 15, మార్చి 15 గడువు తేదీలు. ఏటా షెడ్యూల్ ఇలాగే ఉంటుంది.

తొలిసారి 83,000కు సెన్సెక్స్

ఇంట్రా-డేలో దాటిన సూచీ

1,440 పాయింట్ల వృద్ధితో రికార్డు హై 82,963 వద్ద ముగింపు

నిఫ్టీ సైతం 470 పాయింట్లు పెరిగి మొదటిసారి 25,389 దగ్గరకు

ఒక్కరోజే రూ.6.59 లక్షల కోట్లు ఎగిసిన మదుపరుల సంపద

ముంబై, సెప్టెంబర్ 12: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం రికార్డులతో హోరెత్తించాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ.. రెండూ సరికొత్త ఇంట్రా-డే, క్లోజింగ్ హైలను నమోదు చేశాయి. ఉదయం ఆరంభం నుంచే దూకుడు మీదున్న మదుపరులు.. పెట్టుబడులకు పెద్దపీట వేస్తూపోయారు. ఈ క్రమంలోనే మార్కెట్లు పరుగులు పెట్టాయి. ఒకానొక దశలో సెన్సెక్స్ తొలిసారి 83,000 స్థాయిని అధిగమించింది. ఆఖరి గంటలో జరిగిన ట్రేడింగ్‌లోనైతే 1,593.03 పాయింట్లు లేదా 1.95 శాతం ఎగిసి మునుపెన్నడూ లేనివిధంగా 83,116.19 వద్దకు వెళ్లింది. అయితే ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో చివరకు 1,439.55 పాయింట్లు లేదా 1.77 శాతం పెరుగుదలతో ఆల్‌టైమ్ హై 82,962.71 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 470.45 పాయింట్లు లేదా 1.89 శాతం ఎగబాకి లైఫ్‌టైమ్ హై 25,388.90 వద్ద నిలిచింది. అయినప్పటికీ ఇంట్రా-డేలో 514.9 పాయింట్లు లేదా 2 శాతం పుంజుకొని మొదటిసారి 25,433.35 స్థాయిని తాకింది.

రంగాలవారీగా..

బుల్ రన్‌తో దాదాపు అన్ని రంగాల షేర్లు లాభాల్లోనే స్థిరపడ్డాయి. రంగాలవారీగా చూస్తే.. మెటల్ ఇండెక్స్ అత్యధికంగా 3.05 శాతం పెరిగింది. టెలికం (2.61 శాతం), విద్యుత్తు (2.02 శాతం), ఆటో (1.99 శాతం), యుటిలిటీస్ (1.93 శాతం), కమోడిటీస్ (1.85 శాతం) షేర్లూ రాణించాయి. షేర్లలో భారతీ ఎయిర్‌టెల్, ఎన్టీపీసీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా, ఎల్‌అండ్‌టీ, టాటా స్టీల్, ఎస్బీఐ, కొటక్ మహీంద్రా బ్యాంక్ ఆకట్టుకున్నాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 1.32 శాతం, స్మాల్‌క్యాప్ 0.79 శాతం చొప్పున పెరిగాయి.

కలిసొచ్చిన గ్లోబల్ ట్రెండ్

యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్‌లు వడ్డీరేట్లను తగ్గించబోతున్నాయన్న సంకేతాలు.. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లలో ఒక్కసారిగా ఉత్సాహాన్ని తెచ్చిపెట్టాయి. ఈ జోష్ దేశీయ స్టాక్ మార్కెట్లలోనూ కనిపించిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ విభాగం అధిపతి వినోద్ నాయర్ తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషించారు. ఇక విదేశీ మదుపరుల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన పెట్టుబడులు కూడా ఈక్విటీ మార్కెట్లను పరిగెత్తించాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్ సూచీలు భారీగా పెరిగాయి. చైనా సూచీ మాత్రం స్వల్పంగా నష్టపోయింది. ఐరోపా మార్కెట్లూ ఆకర్షణీయ లాభాల్లోనే ట్రేడ్ అవుతున్నాయి.

తిరుపతి బాలాజీ భళా

మార్కెట్‌లోకి ప్రవేశించిన తొలిరోజే శ్రీ తిరుపతి బాలాజీ అగ్రో ట్రేడింగ్ కంపెనీ లిమిటెడ్ షేర్లు అదిరిపోయే లాభాలను సొంతం చేసుకున్నాయి. ఏకంగా 17.51 శాతం చొప్పున విలువను పెంచుకున్నాయి. ఇష్యూ ధర రూ.83గా ఉంటే బీఎస్ఈ లిస్టింగ్ రూ.92.90 వద్ద జరుగడం గమనార్హం. దీంతో ట్రేడింగ్ మొదట్లోనే 11.92 శాతం వృద్ధి దక్కింది. మదుపరులు ఈ షేర్లను కొనేందుకు విపరీతమైన ఆసక్తి చూపడంతో చివరకు రూ.97.54 వద్ద ముగిసింది. దీంతో 17.51 శాతం పెరిగినట్టైంది. గురువారం ట్రేడింగ్ సమయం ముగిసే నాటికి సంస్థ మార్కెట్ విలువ రూ.795.64 కోట్లుగా ఉన్నది. కెమికల్స్, అగ్రోకెమికల్స్, ఫుడ్ మైనింగ్, వేస్ట్ డిస్పోజల్ ఇండస్ట్రీ, వ్యవసాయ పరిశ్రమలు, లూబ్రికెంట్స్, వంటనూనెలు తదితర రంగాల్లో ఈ సంస్థ వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి.

467 లక్షల కోట్లకు..

స్టాక్ మార్కెట్ల భారీ లాభాలతో మదుపరుల సంపద కూడా అంతే స్థాయిలో ఎగిసింది. గురువారం ఒక్కరోజే బీఎస్ఈలో నమోదైన కంపెనీల మార్కెట్ విలువ రూ.6,59,895.19 కోట్లు పెరిగి రూ.4,67,36,045.21 కోట్ల (5.57 ట్రిలియన్ డాలర్లు)కు చేరింది. వచ్చే వారం జరిగే పాలసీ సమీక్షలో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లకు కోత పెడుతుందన్న అంచనాలు.. దాదాపు అన్ని షేర్లకు కొనుగోళ్ల మద్దతునిచ్చాయని మెహెతా ఈక్విటీస్ లిమిటెడ్ రిసెర్చ్ విభాగం సీనియర్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ తాప్సే అన్నారు.

జీసీసీల అడ్డా తెలంగాణ: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): జీఎఫ్ లైఫ్ టెక్ కొత్త గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) ప్రారంభంతో తెలంగాణ.. ప్రపంచ స్థాయి సాంకేతిక, నూతన పరిశోధనల గమ్యస్థానంగా మారిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ సెంటర్ వల్ల ప్రస్తుతం 200 మందికి ఉద్యోగాలు లభించాయని, వచ్చే మూడేండ్లలో ఈ సంఖ్య 500 దాటగలదన్న విశ్వాసాన్ని కనబర్చారు. గచ్చిబౌలి విప్రో సర్కిల్ వద్ద ఏర్పాటైన జీఎఫ్ లైఫ్ టెక్ జీసీసీని గురువారం మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ కేంద్రం నుంచి జీఎఫ్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ కస్టమర్లకు అత్యుత్తమ సేవలను అందించగలుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఒక్కరోజే రూ.2,000 పెరిగిన వెండి ధర

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: వెండి ధరలు గురువారం భారీ ఎత్తున పెరిగాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఒక్కరోజే కిలో రూ.2,000 ఎగబాకి రూ.87,000 పలికింది. ఈ మేరకు అఖిల భారత సరఫా అసోసియేషన్ వెల్లడించింది. హైదరాబాద్‌లోనూ ధరలు ఇదే స్థాయిలో కదలాడుతున్నాయి. మరోవైపు బంగారం ధర తగ్గింది. 24 క్యారెట్ తులం రూ.250 దిగి రూ.74,350గా ఉన్నది. 22 క్యారెట్ రూ.74,000గా నమోదైంది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ రూ.73,150గా ఉంటే, 22 క్యారెట్ 10 గ్రాములు రూ.67,050గా ఉన్నది. బుధవారంతో చూస్తే రూ.100 మేర ధరలు తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు గోల్డ్ 2,547.70 డాలర్లు, సిల్వర్ 29.16 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నాయి.

ప్రాజెక్ట్ ఇంక్లూజన్‌తో మహిళలకు చేయూత: వీ-హబ్

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు మహిళలకు చేయూతనిచ్చేలా ప్రాజెక్ట్ ఇంక్లూజన్ ఎంతగానో సహకరిస్తుందని వీ-హబ్ సీఈవో సీతా పల్లాచొల్ల తెలిపారు. గురువారం ఇక్కడి వీ-హబ్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రాజెక్ట్ ఇంక్లూజన్ కార్యక్రమానికి తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వీ-హబ్ కృషి చేస్తున్నదన్నారు. అదేవిధంగా మహిళలు ఆంత్రప్రెన్యూర్లుగా ఎదిగేందుకు తోడ్పాటును అందిస్తున్నామని వివరించారు. కాగా, మోడల్ ఎంఎస్ఎంఈల అభివృద్ధి, స్థాపనకు 6 నెలలపాటు ప్రాజెక్ట్ ఇంక్లూజన్ సాగుతుందని సీత స్పష్టం చేశారు. దీనికి రీసస్టైనబులిటీ సంస్థ సీఎస్ఆర్ భాగస్వామిగా ఉందని వెల్లడించారు.

ప్లాస్టో ప్లాంట్‌లో రెన్యువబుల్ ఎనర్జీనే

హైదరాబాద్, సెప్టెంబర్ 12: ప్లాస్టిక్ నీటి ట్యాంకులు, పైపులు, ఫిట్టింగ్స్ తయారీలో ప్రముఖ సంస్థగా ఉన్న ఆర్‌సీ ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్.. తమ తయారీ కేంద్రాన్ని పూర్తిగా రెన్యువబుల్ ఎనర్జీతోనే నడిపిస్తున్నది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో 52 ఎకరాల్లో ఉత్పాదక కేంద్రం ఉన్నది. దీని నెలవారీ ఉత్పత్తి సామర్థ్యం 20 కోట్ల లీటర్ల వాటర్ ట్యాంకులు. కాగా, నాగ్‌పూర్ ప్లాంట్ 100 శాతం రెన్యువబుల్ ఎనర్జీ ఆధారిత మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్‌గా మారడానికి సమీపంలోగల నండూర్బార్‌లోని రెండు విండ్‌మిల్స్‌లో తయారైన గ్రీన్ ఎనర్జీనే దోహదం చేసినట్టు సంస్థ తెలిపింది.

మందగమనంలో పారిశ్రామికోత్పత్తి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: దేశీయ పారిశ్రామికోత్పత్తి మందగించింది. ఈ ఏడాది జూలైలో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 4.8 శాతానికే పరిమితమైంది. నిరుడు జూలైలో 6.2 శాతంగా ఉండటం గమనార్హం. తయారీ, గనుల రంగాల పేలవ ప్రదర్శనే ఈ క్షీణతకు కారణమని గురువారం విడుదల చేసిన అధికారిక గణాంకాల్లో సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖ పేర్కొన్నది. గతంతో పోల్చితే గనుల రంగంలో ఉత్పాదకత 10.7 శాతం నుంచి 3.7 శాతానికి, తయారీ రంగంలో 5.3 శాతం నుంచి 4.6 శాతానికి దిగజారింది. మరోవైపు రిటైల్ ద్రవ్యోల్బణం ఆగస్టులో స్వల్పంగా పెరిగి 3.65 శాతంగా నమోదైంది. అంతకుముందు జూలైలో 3.6 శాతంగా ఉన్నది.



గురువారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో సీఐఐ నిర్వహించిన పవర్ ప్లాంట్ సదస్సు సందర్భంగా ఈ ఏడాదికిగాను ఎనర్జీ ఎఫిషియన్సీ అవార్డును అందుకుంటున్న రామగుండం ఎన్టీపీసీ ఆపరేషన్ విభాగం జీఎం సింఘారాయ్, ఏజీఎం మనోజ్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు

అద్భుత అవకాశాన్ని వినియోగించుకోవాలి

రాయపర్తి/ఖిలావరంగల్, సెప్టెంబర్ 12: నిరుపేదలకు విద్యుత్ శాఖ సారథ్యంలో తక్కువ ధరకు కనెక్షన్ ఇస్తున్నదని, ఈ సువర్ణ అవకాశాన్ని మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని ఎస్ఈ పీ మధుసూదన్‌రావు కోరారు. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, రాయపర్తి, మైలారం ఏఈలు పెద్ది రవళీరెడ్డి, కాసం నిఖిల్‌కుమార్‌తో కలిసి గురువారం ఆయన మైలారం, జయరాంతండా(ఎస్) బాల్ నాయక్‌తండా, వెంకటేశ్వరపల్లి, సన్నూరు, మొరిపిరాల, శివరామపురంలో ఇంటింటికీ వెళ్లి రూ.938కే విద్యుత్ కనెక్షన్‌పై అవగాహన కల్పించారు. తెల్లరేషన్‌కార్డు ఉండి విద్యుత్ మీటర్ లేని నిరుపేదలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. రేషన్‌కార్డు, ఇంటి పన్ను రసీదు, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులతోపాటు రూ.938 చెల్లించి రసీదు పొందాలన్నారు. సబ్ ఇంజినీర్లు కీర్తన, మహ్మద్ ముజాఫర్, అహ్మద్ అలీ, వెంకన్న, శ్రీనివాస్, సునీల్‌కుమార్, ప్రవీణ్, మహ్మద్ అన్వర్, శ్రీకాంత్, మహేశ్, రాజశేఖర్ పాల్గొన్నారు. అలాగే, రూ.938కే విద్యుత్ కనెక్షన్‌పై 37వ డివిజన్ కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ డివిజన్‌లోని ఎన్ఎంనగర్, గిరిప్రసాద్‌నగర్‌లో అవగాహన కల్పించారు. గృహజ్యోతి పథకంలో ఉచితంగా విద్యుత్ పొందాలంటే విధిగా కనెక్షన్ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు సింగారపు ఏలియా, శ్రీనివాస్, సమ్మయ్య, రవి పాల్గొన్నారు.

రసీదు ఇస్తున్న ఎస్ఈ మధుసూదన్‌రావు

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

జిల్లా ఇంటర్ విద్యాధికారి శ్రీధర్ సుమన్

రాయపర్తి, సెప్టెంబర్ 12: ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వ కళాశాలలు, గురుకులాలు, ఆశ్రమ కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది అహర్నిశలు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈవో) డాక్టర్ జీ శ్రీధర్ సుమన్ కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల, తిర్మలాయపల్లిలోని కస్తూర్బాగాంధీ బాలికల గిరిజన ఆశ్రమ కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. కళాశాలల్లోని రిజిస్టర్లు, రికార్డులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల హాజరు పట్టికలు, బోధన, బోధనేతర సిబ్బంది పనితీరును పరిశీలించారు. కళాశాలల్లోని తరగతి గదులు, క్రీడా మైదానాలు, బోధన, బోధనేతర, ప్రిన్సిపాళ్ల కార్యాలయాలు, గ్రంథాలయాలు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, వెల్‌నెస్ సెంటర్లను పరిశీలించారు కళాశాలల్లో ప్రిన్సిపాళ్లతో సమీక్షించారు. విద్యార్థుల హాజరుశాతంతోపాటు కళాశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంపుపై ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ జయకుమారి నేతృత్వంలో శ్రీధర్ సుమన్‌ను ఘనంగా సన్మానించారు.

శ్రీధర్ సుమన్‌ను సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

చిన్న వయస్సులో పెద్ద జబ్బు

- బ్రెయిన్ టీబీతో బాధపడుతున్న చిన్నారి
- కోమాలోకి వెళ్లిన విద్యార్థిని
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు
- ఆపరేషన్‌కు ఆర్థిక సాయం కోసం ఎదురుచూపు

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 12: తోటి బాలలతో ఆడుకోవాల్సిన ఆ చిన్నారికి పెద్ద కష్టం వచ్చింది. ఆడిపాడే వయస్సులో ఆస్పత్రి పాలై నరకయాతన అనుభవిస్తున్నది. వరంగల్ దేశాయిపేట కుమ్మరివాడకు చెందిన పదేళ్లు కూడా నిండని ఆ చిన్నారికి మాయదారి వ్యాధి సోకడంతో కోమాలోకి వెళ్లింది. లక్ష మందిలో ఒకరికి వచ్చే బ్రెయిన్ టీబీ (బ్రెయిన్ ట్యూబర్ క్యులోసిస్) విద్యార్థినికి ప్రాణగండంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. దేశాయిపేట కుమ్మరివాడకు చెందిన ఇజ్జగిరి విక్రం-వెన్నెల దంపతులకు ఇద్దరు కుమార్తెలు. స్థానిక నాగార్జున పాఠశాలలో పెద్ద కుమార్తె సాత్విక 7వ తరగతి, చిన్న కుమార్తె కార్తీక ఐదో తరగతి చదువుతున్నారు. విక్రం మేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. గత మార్చిలో కార్తీకకు జ్వరం రావడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స చేయించారు. అయితే, జ్వరం తగ్గినట్లే తగ్గి నెల రోజుల తర్వాత మళ్లీ వచ్చింది. వెంటనే ప్రైవేట్ దవాఖానలో చికిత్స అందించారు. తర్వాత 15 రోజులకు మళ్లీ జ్వరం రావడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు మరో ప్రైవేట్ దవాఖానతోపాటు ఎంజీఎం దవాఖానలో చూపించారు. బాలిక కోలుకునే పరిస్థితి లేకపోగా కోమాలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు, బంధువుల వద్ద అప్పులు చేసి మరీ వైద్యం చేయించినా బిడ్డ ప్రాణాలు దక్కే పరిస్థితి లేకపోవడంతో కిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు చిన్నారికి బ్రెయిన్ టీబీగా నిర్ధారించారు. వెంటనే సర్జరీ చేస్తే బతికే అవకాశం ఉందని చెప్పారు. అప్పు చేసి శస్త్ర చికిత్స చేయించారు. 20 రోజులపాటు చిన్నారి ఆరోగ్యం కొంత మెరుగైనప్పటికీ మళ్లీ జబ్బు మొదటికొచ్చింది. అయితే, మరోసారి సర్జరీ చేయాలని వైద్యులు తేల్చి చెప్పారు.

దవాఖానలో చికిత్స పొందుతున్న కార్తీక

ఆర్థిక సాయం చేసి ఆదుకోరూ..

'కన్నబిడ్డను బతికించుకోవడానికి ఇప్పటికే ప్రైవేట్, సర్కార్ దవాఖానలు తిరిగాం. చేతిలో చిల్లిగవ్వ లేదు. తెలిసినవాళ్లను బతిమిలాడుకొని రూ. 10 లక్షల వరకు ఖర్చు చేశాం. రెక్కాడితే గాని డొక్కాడని మాకు మళ్లీ అప్పు దొరికే పరిస్థితి లేదు. మా బిడ్డ శస్త్ర చికిత్సకు మరో రూ. 10 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో నోటమాట రావడం లేదు. దాతలు, ప్రజాప్రతినిధులు ఆదుకుంటారని విజ్ఞప్తి చేస్తున్నాం. దాతలు 9000663126, 9390298558 నంబర్లకు ఫోన్ పే, గూగుల్ పే చేసి మా బిడ్డను బతికించండి' అంటూ కార్తీక తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను బిగించాలి

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట, సెప్టెంబర్ 12: ఓవర్ లోడ్ ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మను బిగించాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధికారులను కోరారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. నర్సంపేట నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. విద్యుత్ లైన్లు లేని ఇండ్లకు వెంటనే వేయాలని సూచించారు. వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అసౌకర్యం కలుగొద్దన్నారు. తెల్లరేషన్ కార్డులు కలిగిన వారికి రూ. 938కే కొత్త కనెక్షన్ ఇవ్వాలని కోరారు. లూజు లైన్లు ఉన్న చోట్ల సరిచేసి మిడిల్ పోల్స్ వేయాలన్నారు. ఇండ్ల పైనుంచి విద్యుత్ లైన్లు ఉంటే తొలగించాలన్నారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కోరారు. డీఈ ఆర్.శ్రీధర్, ఏడీఏ లక్ష్మణ్, ఏడీఈ మల్లేశం, ఏఈలు శ్రీధర్, రామకృష్ణ, రాజు, రామ్మూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

త్వరలోనే వైద్య కళాశాల ప్రారంభం

నర్సంపేటరూరల్: త్వరలోనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. సర్వాపురం శివారులో జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, తహసీల్దార్ రాజేశ్ ఉన్నారు. అలాగే, దామెర చెరువులో వినాయక నిమజ్జన ఏర్పాట్లను దొంతి పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో విగ్రహాల నిమజ్జనం జరిగేలా చూడాలని అధికారులను కోరారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజినీకిషన్, టౌన్ సీఐ రమణమూర్తి, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు ఉన్నారు.

కీటకజనిత వ్యాధులను నియంత్రించాలి

డీఎంహెచ్‌వో వెంకటరమణ

గిర్మాజీపేట, సెప్టెంబర్ 12: కీటకజనిత వ్యాధులపై ప్రజలందరినీ అప్రమత్తం చేస్తూ వాటి నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. గురువారం ఆయన తన కార్యాలయం నుంచి ప్రోగ్రాం అధికారులు, అన్ని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, సబ్ యూనిట్ అధికారులతో జామ్ మీటింగ్ ద్వారా సమీక్షించారు. డివిజన్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా డెంగ్యూ కేసుల వివరాలు తెలుసుకొని, అందుకు చేపట్టిన చర్యలపై సమీక్షించారు. ప్రస్తుతం డెంగ్యూ తీవ్రత నర్సంపేట డివిజన్‌లో అధికంగా ఉన్నందున పీహెచ్‌సీ వైద్యాధికారులు వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బందితో సమన్వయం చేసుకొని డెంగ్యూ ప్రభావిత ప్రాంతాల్లో యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టాలని సూచించారు. ఇండ్లల్లో పైరిత్రిమ్ స్ప్రే చేయించాలన్నారు. విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు గోపాల్ రావు, ప్రకాశ్, ప్రోగ్రాం అధికారులు మోహన్‌సింగ్, పద్మశ్రీ, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

సక్రమంగా పారిశుధ్య పనులు చేపట్టాలి

నర్సంపేట, సెప్టెంబర్ 12: పట్టణంలో పారిశుధ్య పనులను సక్రమంగా చేపట్టాలని నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజినీకిషన్ అన్నారు. నర్సంపేటలో గురువారం మున్సిపల్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వినాయక నిమజ్జనం, దసరా ఉత్సవాలకు రూ.24.89లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఆస్తి పన్ను వసూలు కోసం ఐదు హ్యాండ్ హెల్డ్ మిషన్స్ కొనుగోలు చేయాలని నిర్ణయించామన్నారు. నర్సంపేటలో తైబజార్, పశువులు, మేకల గొర్రెల రాదారి, గంప చీటి, కమేలా సీల్డ్ కవర్ కొటేషన్ రేటును పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ జోనా, కౌన్సిల్ సభ్యులు తిరుమల, రాజు, శ్రీదేవి, రాజు, రజిత, కీర్తిరెడ్డి, పద్మ, రమాదేవి, గోల్య, సాంబయ్యగౌడ్, రాజేందర్, లక్ష్మీ